సాక్షి
బాపట్ల
ఆదివారం । 9 । ఫిబ్రవరి । 2025




## వైభవంగా కల్యాణం

నగరంపాలెం: గుంటూరు బ్రాడీపేటలోని ఓంకార క్షేత్రం కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత ఓంకార క్షేత్రంలో శనివారం శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి కల్యాణం నిర్వహించారు.



## సామూహిక హరినామ జప యజ్ఞం

తాడేపల్లిరూరల్: కొలనుకొండలో ఉన్న హరేకృష్ణ గోకుల క్షేత్రంలో భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం సామూహిక హరినామ జప యజ్ఞం ఘనంగా నిర్వహించారు.



## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 546.00 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 10,120 క్యూసెక్కులు విడుదలవుతోంది.

# మాఫియా మధ్య ఆధిపత్య పోరు

- బియ్యం వ్యాపారంలో రెండు వర్గాలు
- పచ్చనేతతో ఒప్పందం చేసుకున్న ఒంగోలు మాల్యాద్రి బ్యాచ్
- నెలకు రూ.25 లక్షలు కప్పం చెల్లింపు
- పోటీగా బియ్యం వ్యాపారం మొదలు పెట్టిన మోటుపల్లి బ్యాచ్
- తామూ పచ్చనేతకు నెల మామూళ్లు ఇచ్చామంటూ మెలిక
- బియ్యం అక్రమ మార్గం పడితే క్రిమినల్ కేసులంటున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లా వ్యాప్తంగా చౌక బియ్యం వ్యాపారం జోరుగా సాగుతుంది. చీరాల నియోజకవర్గంలో మాత్రం రెండు బ్యాచ్‌లు పోటాపోటీగా బియ్యం సేకరించి అమ్మకానికి పెడుతున్నాయి. పచ్చనేతకు నెల మామూళ్లు చెల్లించడం మొదలు డీలర్లకు చెల్లించే రేటు విషయంలోనూ రెండు బ్యాచ్‌లు పోటీలు పడుతున్నాయి. దీంతో రెండు బ్యాచ్‌ల మధ్య ఆదిపత్య పోరు ప్రారంభమైంది. ఈ విషయం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. కూటమి సర్కారు కొలువు దీరినప్పటి నుంచి ఇప్పటి వరకూ చీరాలలో మూడు బ్యాచ్‌లు పోటీలు పడి చౌక బియ్యం వ్యాపారాన్ని నడిపిస్తున్నాయి. ఇటీవల ఒంగోలు మాల్యాద్రి బ్యాచ్ చీరాల పచ్చనేతకు నెలకు రూ.25 లక్షలు చెల్లించి బియ్యం తరలింపునకు అనుమతి పొందినట్లు సమాచారం. ఇందుకోసం నేతకు రెండు నెలల అడ్వాన్స్ రూ.50 లక్షలు చెల్లించినట్లు తెలిసింది. జనవరి నెల నుంచే మాల్యాద్రి బ్యాచ్ డీలర్ల వద్ద నుంచి బియ్యం సేకరణకు దిగింది. దాదాపుగా బియ్యం సేకరించింది. మరోవైపు గతంలో అక్రమంగా బియ్యం వ్యాపారం సాగించిన చినగంజాం మండలం మోటుపల్లికి చెందిన దందా నిర్వాహకుడు తిరిగి చీరాలలో రేషన్ బియ్యం వ్యాపారం మొదలు పెట్టాడు. డీలర్‌కు కిలో రూ.17 చెల్లిస్తున్నాడు. పాత పరిచయం కూడా ఉండడంతో పలువురు డీలర్లు మోటుపల్లి బ్యాచ్‌కు బియ్యం విక్రయిస్తున్నట్లు సమాచారం. జనవరి నెలలో మోటుపల్లి బ్యాచ్ కొంతమేర బియ్యం సేకరించి ఆ



బియ్యాన్ని కూటమి సర్కార్ ప్రారంభంలో చీరాలలో రేషన్ బియ్యం వ్యాపారం సాగించిన ఒంగోలు ప్రసాద్‌కు విక్రయిస్తున్నట్లు సమాచారం.

**రెండు బ్యాచ్‌ల మధ్య గొడవలు**

రేషన్ బియ్యం సేకరణపై రెండు బ్యాచ్‌ల మధ్య పోరు మొదలైంది. పచ్చనేతకు నెలకు రూ.25 లక్షలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్న ఒంగోలు మాల్యాద్రి బ్యాచ్ తాము కప్పం కడుతున్నందున చీరాల నియోజకవర్గంలో వేరొకరు బియ్యం సేకరణ చేయకూడదని మోటుపల్లి దందా నిర్వాహకుడితో వాగ్వివాదానికి దిగినట్లు సమాచారం. తాము కూడా పచ్చనేతకు డబ్బులు చెల్లించామని, బియ్యం సేకరించేందుకు తమకూ హక్కు ఉందని మోటుపల్లి సమాధానమిచ్చినట్లు తెలుస్తోంది.

**ధర చెల్లింపులో పోటాపోటీ**

రేషన్ డీలర్లకు ధర చెల్లింపులోనూ రెండు బ్యాచ్‌లు పోటీపడుతున్నాయి. మాల్యాద్రి బ్యాచ్ డీలర్‌కు కిలోకు రూ.15 ఇస్తుండగా మోటుపల్లి బ్యాచ్ కిలోకు రూ.17 చెల్లిస్తున్నారు. దీంతో నియోజకవర్గంలోని చాలామంది డీలర్లు మోటుపల్లి బ్యాచ్‌కు చౌక బియ్యం ఇచ్చేందుకు మొగ్గు చూపిస్తున్నారు.

**మోటుపల్లికే అధికారుల అండ**

పచ్చనేతకు నెలకు రూ.25 లక్షలు చెల్లిస్తున్నామన్న దర్పంతో మాల్యాద్రి బ్యాచ్ పౌరసరఫరాల అధికారులను, అటు పోలీసులను విస్మరించినట్లు తెలుస్తోంది. ఇదే అవకాశంగా అక్రమ బియ్యం వ్యాపారంలో ఆరితేరిన ఒంగోలు ప్రసాద్, మోటుపల్లి బ్యాచ్ డీలర్లకు అధిక ధర చెల్లించడమే కాకుండా పోలీసులతోపాటు పౌరసరఫరాల అధికారులకు నెల మామూళ్లు చెల్లిస్తున్నట్లు సమాచారం. దీంతో పోలీసులు, పౌరసరఫరాల అధికారులు మోటుపల్లి బ్యాచ్‌కు సహకరిస్తున్నట్లు తెలిసింది.

దీంతో మాల్యాద్రి బ్యాచ్ బియ్యం కొనుగోలులో వెనుకబడినట్లు తెలుస్తోంది. పచ్చనేతకు తాము నెలకు పెద్ద మొత్తంలో కప్పం కడుతున్నందున డీలర్లు బియ్యం తమకే ఇవ్వాలని మాల్యాద్రి బ్యాచ్ డిమాండ్ చేయగా అందుకు డీలర్లు ససేమిరా అన్నట్లు తెలుస్తోంది.

**అధికారులు హెచ్చరికలు**

ఇదిలా ఉండగా శుక్రవారం జిల్లా పౌరసరఫరాల అధికారులు చీరాల డీలర్లతో సమావేశం నిర్వహించి బియ్యం అక్రమంగా తరలిస్తే చూస్తూ ఊరుకోమని, క్రిమినల్ కేసులు పెడతామంటూ హెచ్చరించారు.

**గందరగోళంలో మాల్యాద్రి బ్యాచ్**

పచ్చ నేత చేతులెత్తేయడంతో మాల్యాద్రి బ్యాచ్ గందరగోళంలో పడినట్లు తెలుస్తోంది. పచ్చనేతకు నెలకు రూ.25 లక్షలు చొప్పున రెండు నెలలకు రూ.50 లక్షలు చెల్లించామని, దందా మానుకుంటే పైసా కూడా రికవరీ అయ్యే పరిస్థితి లేకపోవడంతో ముందు నుయ్యి వెనుక గొయ్యిలా తయారైంది.

**చేతులెత్తేసిన పచ్చనేత**

వివాదం ముదరడంతో పచ్చ నేత చేతులెత్తేసినట్లు సమాచారం. నియోజకవర్గంలోని డీలర్లు మొత్తం తమకే రేషన్ బియ్యాన్ని ఇవ్వాలని మాల్యాద్రి బ్యాచ్ పచ్చనేత వద్ద డిమాండ్ చేసినట్లు సమాచారం. నియోజకవర్గంలో రేషన్ బియ్యం వ్యాపారం చేసుకుంటామని వస్తే ఓకే చెప్పామని, మీరు మీరు పోటీలు పడి నాపై ఒత్తిడి తెస్తే కుదరదని, డీలర్లు ఎవరికి బియ్యం ఇస్తే వారే వ్యాపారం చేసుకోవాలని పచ్చ చెప్పినట్లు తెలిసింది.

# సముద్ర తాబేళ్ల పరిరక్షణకు చర్యలు

ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఏకే నాయక్



నెల్లూరు(అర్బన్): సముద్ర తాబేళ్ల పరిరక్షణకు స్వచ్ఛంద సంస్థలు, మత్స్య, మెరైన్ తదితర శాఖల సమన్వయంతో యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేశామని రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఏకే నాయక్ తెలిపారు. తాబేళ్ల అవసరం, వాటిని కాపాడుకోవడం అనే అంశంపై వివిధ జిల్లాల అటవీశాఖ అధికారులు, ట్రీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నెల్లూరులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో వర్క్‌షాపు నిర్వహించారు. ఏకే నాయక్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో తీరంలో 2 వేల నుంచి 3 వేల వరకు తాబేళ్లు మృతి చెందాయన్నారు. దీనికి ప్రధాన కారణం మత్స్యకారులు సముద్రంలో వారికి కేటాయించిన దూరం వెళ్లకుండా పెద్ద, పెద్ద యంత్రాలతో కూడిన బోట్లను వాడడం, మెకనైజ్ వలలను వాడడమే కారణమన్నారు. సముద్రంలో నుంచి గుడ్లు పెట్టేందుకు తీరంలోకి వస్తున్న తాబేళ్లు ఆ వలలో పడి మృత్యువాత పడుతున్నాయన్నారు. తాబేళ్లతో సముద్రంలో జీవ సమతుల్యత ఏర్పడుతుందన్నారు. అవి నీటిని పరిశుభ్రం చేస్తాయన్నారు. అలాంటి జీవులను కాపాడుకోకపోతే మత్స్య సంపదకు కూడా ముప్పు వస్తుందన్నారు. అందువల్ల మత్స్యకారులు తీరం సమీపంలో వేట చేయరాదన్నారు. దూరం వెళ్లి వేట సాగించాలన్నారు. సంప్రదాయ బోట్లను మాత్రమే వాడాలన్నారు. ఇందుకోసం మత్స్యకారులను చైతన్యం చేయాలన్నారు. మత్స్య, మెరైన్ శాఖల అధికారులు, ఎన్‌జీఓలు కలిసి ప్రణాళికాబద్ధంగా రాష్ట్ర వ్యాప్తంగా చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఎవరైనా తాబేళ్లను పట్టుకుని అక్రమంగా తరలిస్తే అలాంటి వారిపై కఠినమైన వైల్డ్ లైఫ్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేయిస్తామన్నారు. తాబేళ్ల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ఫారెస్ట్, ఇతర శాఖల అధికారులు చర్చించారు. జిల్లాల వారీగా చర్చలు జరిపారు. నెల్లూరు టెరిటోరియల్ ఫారెస్ట్, ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గుంటూరు ఫారెస్ట్ కన్జర్వేటర్ కేవీ రాజు, తిరుపతి కన్జర్వేటర్ సెల్వం, నెల్లూరు డీఎఫ్ఓ మహబూబ్‌బాషా, సూళ్లూరుపేట వైల్డ్‌లైఫ్ ఫారెస్ట్, ప్రకాశం, ఏలూరు, బాపట్ల తదితర జిల్లాల ఫారెస్ట్ అధికారులు మత్స్యశాఖ అధికారులు, ఇండియన్ కోస్ట్ గార్డు , మెరైన్ పోలీసు, మత్స్యశాఖ అధికారులు, ట్రీ ఫౌండేషన్ బాధ్యులు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# త్రుటిలో తప్పిన ప్రమాదం

- లారీని తప్పించబోయి ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా
- ప్రయాణికులంతా క్షేమం



పిడుగురాళ్ల: త్రుటిలో ఘోర ప్రమాదం తప్పిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి చీమకుర్తికి వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి పట్టణంలోని సూర్యకలర్స్ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 40 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. బస్సు డ్రైవర్‌కు మాత్రం చిన్నపాటి గాయాలయ్యాయి. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సంఘటన స్థలాన్ని పిడుగురాళ్ల పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావ్ పరిశీలించారు.

## న్యూస్‌రీల్

### ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్ర వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించామని చెప్పారు. ముగింపు రోజు సందర్భంగా ఉదయం శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి తిరుమంజనం, అష్టోత్తర శతనామార్చన, వేదాశీర్వచనముతో కార్యక్రమాలు ఘనంగా ముగిశాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయకీలాద్రి దివ్యక్షేత్ర అర్చకులు, వేదపండితులు, జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వేదవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### డైక్ సెంటర్‌లో జడ్జి వై.గోపాలకృష్ణ పరిశీలన



గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్‌లోని జిల్లా సత్వర చికిత్స కేంద్రాన్ని (డైక్) శనివారం సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ వై.గోపాలకృష్ణ సందర్శించారు. డైక్ సెంటర్‌లో పిల్లలకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.

### హెడ్ పోస్టాఫీసులో సీపీఎంజీ తనిఖీ



తెనాలి: ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ (సీపీఎంజీ) కె.ప్రకాష్ శనివారం స్థానిక కొత్తపేటలోని ప్రధాన పోస్టాఫీసును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 10.45 గంటల ప్రాంతంలో పోస్టాఫీసుకు చేరుకుని నేరుగా మెయిల్స్ విభాగానికి వెళ్లారు. అక్కడ మెయిల్స్, పార్శిళ్ల వివరాలను తెలుసుకున్నారు. అకౌంట్స్ విభాగాన్ని సందర్శించారు. జీవిత బీమా చాంబర్‌లో రికార్డులను తనిఖీ చేశారు. నగదు బదిలీలు జరుగుతుండే కౌంటర్లకు వెళ్లారు. అక్కడ సిబ్బందితో మాట్లాడారు. ట్రెజరీ విభాగాన్ని తనిఖీ చేశారు. డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ జి.కరుణాకర బాబు, పోస్ట్‌మాస్టర్ ఈ.నాగేశ్వరరావు, వివిధ విభాగాల అధికారులు వెంట ఉన్నారు.

### సైబర్ భద్రతకు సవాళ్లపై సదస్సు




తాడికొండ: ఢిల్లీలోని నేషనల్ సైబర్ భద్రతా పరిశోధన మండలి, ఏఐసీటీఈ సహకారంతో వీఐటీ–ఏపీ విశ్వవిద్యాలయంలో జాతీయ స్థాయి హ్యాకథాన్ ఎక్స్ పేరిట సదస్సును శనివారం నిర్వహించారు. సైబర్ భద్రతా ఔత్సాహికులు, నిపుణులు, విద్యావేత్తలు పాల్గొన్నారు. విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు మాట్లాడుతూ డిజిటల్ యుగంలో సైబర్ బెదిరింపులు రోజుకో రూపంలో ఉంటున్నాయని తెలిపారు. న్యూఢిల్లీలోని ఎన్‌సీఎస్‌సీఆర్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ గౌరవ సలహాదారు షేక్ అహ్మద్ మాట్లాడుతూ... సైబర్ సెక్యూరిటీ అనేది వ్యక్తిగతమైనది కాదన్నారు.

# తీరప్రాంత పరిరక్షణ మనందరి బాధ్యత

మత్స్యకార సంక్షేమ సమితి జాతీయ నాయకులు జి.మురళీధర్

బాపట్ల: తీరప్రాంత పరిరక్షణ అందరి బాధ్యత అని మత్స్యకార సంక్షేమ సమితి జాతీయ నాయకులు జి.మురళీధర్ పేర్కొన్నారు. మత్స్యకార సంక్షేమ సమితి 20వ రాష్ట్ర సర్వసభ్య సమావేశం శనివారం శీలంవారిపాలెంలోని హితైషిని కార్యాలయంలో నిర్వహించారు. మురళీధర్ మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి గురించి పనిచేస్తున్న సంస్థ ఇది మాత్రమేనని తెలిపారు. కులవృత్తులలో అత్యంత ప్రమాదకరమైనది మనదేనని గుర్తు చేశారు. సముద్రంలో చేపల వేట, వేటకు వెళ్లే సమయంలో సముద్ర కెరటాల ధాటికి బోటు తిరగబడి చనిపోయిన వారు చాలామంది ఉన్నారని పేర్కొన్నారు. ఆపదను ఎదుర్కొనేందుకు వీరందరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫిషర్‌మెన్ లైఫ్ సేవింగ్ సేఫ్టీ టెక్నిక్ కోర్సుల(లైఫ్ సేవింగ్)లో శిక్షణ ఇప్పించాలని సూచించారు. చీరాల, బాపట్ల మండలాల మధ్యలో ఉన్నటువంటి అడవిపాలెం పంచాయతీలో ఈపురుపాలెం స్ట్రైట్ కట్ కాలువ పూడిక తీయించి ఆ కాలువలో బోట్లు కట్టుకునే వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. సముద్ర వ్యాపారాలు, మత్స్య సంపద ఎగుమతుల్లో వస్తున్నటువంటి లాభాల్లో 25 శాతం రాయల్టీని మత్స్య శాఖ అభివృద్ధికి కాకుండా మత్స్యకారుల అభివృద్ధికి కేటాయించాలని కోరారు. విద్య, ఆరోగ్య, సామాజిక భద్రత అభివృద్ధికి ఉపయోగించాలన్నారు. తీర ప్రాంతంలో వేట



మాట్లాడుతున్న మత్స్యకార సంక్షేమ సమితి జాతీయ నాయకులు జి.మురళీధర్

నిబంధనలను వదిలి కడలూరు నుంచి పెద్ద స్పీడ్ బోట్లు వచ్చి ఆంధ్ర ప్రాంతంలో దౌర్జన్యంగా వేటాడుతూ దాడులు చేస్తూ నష్టం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. దీనికి చట్టబద్ధమైన న్యాయం చేయాలన్నారు. రూ.30 లక్షల ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించాలని, పార్థివదేహాన్ని చివరి చూపు కోసం స్వగ్రామానికి ప్రభుత్వ ఖర్చుతో రప్పించాలని, దహన సంస్కారాల కోసం తక్షణ ఆర్థిక సాయం అందించాలన్నారు. తీరప్రాంత మత్స్యకార పంచాయతీల్లో హైస్కూలు లేనిచోట కొత్తగా హైస్కూల్ ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రంలో మత్స్యకారులకు అన్ని రంగాల్లో నామినేటెడ్ పదవులు ఇవ్వాలని, కేంద్ర రాష్ట్ర మత్స్య శాఖల కమిటీలలో మెంబర్లుగా, డైరెక్టర్లుగా ప్రతి జిల్లా నుంచి తీసుకోవాలన్నారు. సమావేశంలో హరికుమార్‌రెడ్డి, కోలంగారి పోలయ్య, రాష్ట్ర అధ్యక్షులు ఉమ్మడి మహేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరిమెళ్ల వాసు, 26 జిల్లాల నుంచి మత్స్యకార సంక్షేమ సమితి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# శాసనమండలిలో ప్రజాగళం వినిపిస్తా

- ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు
- 10న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా నామినేషన్

గుంటూరుఎడ్యుకేషన్: ప్రజా సమస్యలను అజెండాగా చేసుకుని వాటి పరిష్కారం దిశగా ప్రభుత్వంతో పోరాటం చేస్తున్నట్లు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. శాసనమండలి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి ఈ నెల 27వ తేదీన జరగనున్న ఎన్నికల్లో పీడీఎఫ్ తరపున మరోసారి పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావు 10వ తేదీన నామినేషన్ వేస్తున్న సందర్భంగా శనివారం గుంటూరులోని హోటల్‌లో తన మద్దతుదారులతో కలిసి మీడియాతో మాట్లాడారు. 2007లో శాసనమండలి పునరుద్ధరించిన నాటి నుంచి పీడీఎఫ్ ఎమ్మెల్సీలు నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ, వివిధ వర్గాల సమస్యలను మండలిలో ప్రస్తావిస్తున్నారన్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా మంచి నిర్ణయాలు తీసుకుంటే సమర్థిస్తూ, ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తే వ్యతిరేకించామన్నారు. రాజ్యాంగ విలువలకు కట్టుబడి పని చేస్తున్నామన్నారు. అన్నివర్గాల ప్రజల తరపున గళం వినిపించామన్నారు. రాజకీయ పార్టీల నుంచి వచ్చే ఎమ్మెల్సీలు సమస్యలపై ప్రభుత్వాలను నిలదీయగలరా? అని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

పోటీలో ఎవరున్నా భయపడే ప్రసక్తి లేదని, ఏడు నెలల కూటమి పాలన చూసిన ప్రజలు సరైన తీర్పు ఇస్తారని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి పీడీఎఫ్‌ను గెలిపించాలని లక్ష్మణరావు కోరారు. 10వ తేదీ ఉదయం 10 గంటలకు గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సభ అనంతరం కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు ఎం.హనుమంతరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యు.రాజశేఖరరావు, ఎం.కళాధర్, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ నాయకులు కుమార్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు డి. లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

అద్దంకి రూరల్‌: అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, మామ, అత్తలపై వివాహిత ఇచ్చిన ఫిర్యాదు ఎస్సై ఖాదర్‌బాషా శనివారం కేసు నమోదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. అద్దంకి మండలం తిమ్మాయపాలెం గ్రామానికి చెందిన యెర్రిబోయిన భూలక్ష్మిని నూజండ్ల మండలం ములకలూరు గ్రామానికి చెందిన కొనంకి బాల వీరయ్యతో ఐదేళ్ల కిందట పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. వివాహ సమయంలో బాలవీరయ్యకు రూ. 50 వేల నగదు, ఒక ఎకరం భూమి, 20 సవర్ల బంగారం కట్నకానుకల కింద ఇచ్చారు. వీరికి ఒక పాప ఉంది. అదనపు కట్నం తీసుకురావాలని కొంత కాలంగా మామ, అత్త, భర్త తరచూ తిట్టడం, కొట్టడం చేస్తూ వేధిస్తున్నారు. ఈ నేపథ్యంలో భూలక్ష్మి తన పుట్టిల్లు తిమ్మాయపాలెం వచ్చి శనివారం స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో ఎస్సై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చీరాల: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం ఉదయం చీరాల–ఈపూరుపాలెం రహదారిపై జరిగింది. ఈపూరుపాలెం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వెదుళ్లపల్లికి చెందిన దాసరి డేనియల్ ప్రసాద్ మరో ఇద్దరు వెదుళ్లపల్లి నుంచి చీరాలకు ద్విచక్రవాహనంపై వస్తున్నారు. ఈపూరుపాలెం జెడ్పీ బాలుర హైస్కూల్ నీటి పంపు వద్ద నిలిపి ఉంచిన గడ్డి ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో దాసరి డేనియల్ ప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

### సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్రపతికి లేఖలు

నరసరావుపేట: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు శనివారం లేఖలు రాశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయాలని, ఐసీడీఎస్‌కు నిధులు పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనాలు అమలు చేయాలనే సమస్యలను పరిష్కరించాలని కోరుతూ లేఖలు రాశారు.

# కేసుల విచారణ ప్రక్రియలో వేగం పెంచాలి

జిల్లా ఏఎస్పీ (క్రైం) కె.సుప్రజ



నగరంపాలెం: జిల్లాలోని పోలీస్‌స్టేషన్లకు సంబంధించి న్యాయస్థానాల్లో నెలకొన్న కేసుల విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా ఏఎస్పీ (క్రైం) కె.సుప్రజ అన్నారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో కోర్టు కానిస్టేబుళ్లతో సమావేశం నిర్వహించారు. కె.సుప్రజ మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. నిందితుల ఆచూకీ తెలియకపోతే వారికి అనుబంధంగా ఉన్న వ్యక్తులను కోర్టుల్లో హాజరుపరచాలని చెప్పారు. ప్రధానంగా హత్య, హత్యాయత్నం, ఎన్‌డీపీఎస్, పోక్సో, అత్యాచార కేసులకు సంబంధించి విచారణ ఆయా కోర్టుల్లో వెంటనే జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. నేరాలకు పాల్పడిన వారికి శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఆయా కేసులకు సంబంధించి చార్జిషీట్లను కోర్టుల్లో దాఖలు చేశాక పీఆర్‌సీ (ప్రిలిమినరీ రిజిస్ట్రేషన్ కేసు) నంబరు, ఎస్‌సీ (సెషన్స్ కేసు) నంబరు, సీసీ (కోర్టు కేసు) నంబరు సకాలంలో వచ్చేలా చూడాలన్నారు. వచ్చే నెల 8వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని సూచించారు. ఆయా న్యాయస్థానాల్లో కేసుల ఛార్జ్‌షీట్ల దాఖలు, ఎన్‌బీడబ్ల్యూ జారీ, కేసుల విచారణకు అవసరమైన పత్రాల దాఖలుకు సంబంధించి సాంకేతిక సమస్యలు తలెత్తితే సంప్రదించాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీలు అజీజ్ (తూర్పు) శివాజీరాజు (సీసీఎస్), భానూదయ (దక్షిణ), డీసీఆర్‌బీ సీఐ బి.నరసింహారావు, పోలీస్ అధికార, సిబ్బంది పాల్గొన్నారు.



హాజరైన డీఎస్పీలు, సీఐలు

# గుణదల కొండకు ఉత్సవ శోభ

- నేటి నుంచి మేరీమాత ఉత్సవాలు ప్రారంభం
- పుణ్యక్షేత్రం విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్న పుణ్యక్షేత్రం

గుణదల(విజయవాడ తూర్పు): మేరీమాత కొలువైన గుణదల కొండ ఉత్సవ శోభను సంతరించుకుంది. వివిధ రకాల పుష్పమాలికలతో అంతరాలయం ముస్తాబైంది. రంగురంగుల విద్యుత్ దీపాలతో సరికొత్తగా పుణ్యక్షేత్రం పరిసరాలు అన్నీ కాంతులీనుతున్నాయి. మూడు రోజులు కొనసాగనున్న ఉత్సవాలు ఆదివారం ప్రారంభంకానున్నాయి. ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించేందుకు గుణదల పుణ్యక్షేత్రం పాలకవర్గం సమష్టిగా కృషిచేస్తోంది. ప్రభుత్వ అధికారులు, ప్రైవేటు సిబ్బందితో కలసి సమన్వయంగా తిరునాళ్ల నిర్వహణ చేపట్టింది. ఇప్పటికే ఏర్పా ట్లు పూర్తయ్యాయి. పుణ్యక్షేత్ర ప్రాంగణాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. కొండ దిగువ నుంచి శిఖరాగ్రం వరకు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. రాత్రి సమయాల్లో మరియమ్మ కొండ విద్యుత్‌దీపాల కాంతులతో మిరిమిట్లుగొలుపుతోంది.

**తిరునాళ్ల సందడి**

మేరీమాత పుణ్యక్షేత్రానికి లక్షలాదిగా తరలివచ్చే యాత్రికులను ఆకట్టుకునేందుకు చిరువ్యాపారులు దుకాణాలను ఏర్పాటుచేశారు. రుచికరమైన మిఠాయిలు, బెల్లం చెరకు, ఖర్జూరం వంటి తినుబండాలను సిద్ధం చేశారు. యాత్రికులను ఆకట్టుకునేలా ఫొటో స్టూడియోలు వెలిశాయి. ఆటవస్తువుల దుకాణాలు, గాజుల అంగళ్ల ఏర్పాటుతో గుణదలలో తిరునాళ్ల సందడి నెలకొంది.



విద్యుత్ వెలుగుల్లో దేవాలయం

**సాంస్కృతిక కార్యక్రమాలు**

తిరునాళ్లకు హాజరయ్యే భక్తుల కోసం ఉత్సవ కమిటీ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసింది. బిషప్ గ్రాసి పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక పై సమష్టి దివ్యబలి పూజతో పాటు కోలాటం, బైబిల్ నాటికలు, ఏకపాత్రాభినయం వంటి ప్రదర్శనలు యాత్రికులను కనువిందు చేయనున్నాయి.

**ఉత్సవాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు**

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): గుణదల మేరిమాత ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులు నడుపుతుందని సంస్థ అధికారులు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు ఆదివారం తొమ్మిది, సోమవారం 24, మంగళవారం 24 చొప్పున బస్సులు నడుపుతామని పేర్కొన్నారు. రద్దీని బట్టి అదనపు బస్సులను ఏర్పాటు చేస్తామని వివరించారు.



విద్యుత్ వెలుగుల్లో దేవాలయ ప్రాంగణం



కొవ్వొత్తులు వెలిగిస్తున్న భక్తులు

# కుక్క కరిచినా కనికరించలేదు

డాక్టర్ రాక.. అద్దంకి వైద్యశాలలో గాయాలతోనే గంటల సేపు ఎదురుచూపు

అద్దంకి రూరల్‌: కుక్క కరిచిన వ్యక్తి గాయాలతో వైద్యశాలకు చేరుకుని డాక్టర్ కోసం మూడు గంటల పాటు ఎదురు చూసిన సంఘటన అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో శనివారం చోటుచేసుకుంది. క్షతగాత్రుడు తెలిపిన వివరాల మేరకు.. అద్దంకిలోని మధురానగర్‌లో నివాసం ఉంటున్న విప్పర్ల వెంకటేశ్వర్లు శనివారం ఉదయం 6 గంటలకు స్థానిక ఎన్‌ఆర్‌నగర్‌కు వెళ్లాడు. బైకు ఆపి దిగుతుండగా రెండు కుక్కలు వచ్చి దాడిచేసి కాళ్లమీద కరిచాయి. వెంటనే ఇంజక్షన్ చేయించుకునేందుకు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లగా.. అక్కడ డ్యూటీలో డాక్టర్ లేరని.. వచ్చేవరకు వేచి ఉంటే ఉండాలని.. లేకపోతే పొమ్మని సిబ్బంది, నర్సులు చెప్పారు. డాక్టర్ వచ్చేసరికి 10 గంటలు అయింది. అప్పటివరకు కాలు వెంట రక్తం కారుతున్నా నొప్పిని ఓర్చుకుంటూ వేచి ఉన్నాడు. వైద్యశాలలో నైట్ డ్యూటీ చేసే డాక్టర్, నర్సులు ఉదయం 9 గంటల వరకు పనిచెయ్యాలి.. కానీ డాక్టర్ లేడన్న నెపంతో క్షతగాత్రుడిని పట్టించుకోలేదు. డాక్టర్‌లు, సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై ప్రతి ఒక్కరూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.



కుక్కకరిచి గాయాలైన క్షతగాత్రుడి కాలు

# వైభవంగా పునీత తోమాసు వారి మహోత్సవం

అమరావతి: మండల పరిధిలోని అత్తలూరులో అత్యంత పురాతనమైన పునీత తోమాసు వారి ఉత్సవాలను శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే ప్రార్థన కార్యక్రమాలలో భాగంగా గుంటూరు మేత్రాసన జూబిలీ గురువర్యులు రెవరెండ్ ఫాదర్ చిన్నాబత్తిన భాగ్యయ్య, తొలుత జిల్లావ్యాప్తంగా పలు చర్చిల నుంచి వచ్చిన 40 మంది విచారణ గురువులతో దివ్య పూజాబలి కార్యక్రమం నిర్వహించారు. 1936 సంవత్సరంలో నిర్మించిన ఈ చర్చిలో అప్పటినుంచి ఇప్పటివరకు సాంప్రదాయబద్ధంగా పూజాబలి కార్యక్రమాలను నిర్వహించటం ఆనవాయితీగా వస్తుంది. ఈసందర్భంగా మండలంలో పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. అత్తలూరు తోమాసు చర్చి ఫాదర్ రెవరెండ్ ఫాదర్ చాట్ల కస్పార్ మాట్లాడుతూ అందరూ దైవంపై విశ్వాసంతో తోటి మానవులపై కరుణతో జీవించాలన్నారు. ఏసుప్రభు మానవులకు చేసిన అనేక మంచి కార్యాలకు కృతజ్ఞతగా ఈ పండుగను నిర్వహిస్తున్నామన్నారు.




మహోత్సవంలో దివ్యపూజాబలి ప్రార్థనలు చేస్తున్న ప్రధాన గురువులు

అనంతరం సాయంత్రం 4 గంటలకు నిర్వహించిన కోలాట ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఐదు గంటలకు ఒత్తుల సమర్పణ కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తులతో భక్తులంతా వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రాత్రి ప్రత్యేకంగా విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించిన తేరుపై ఏసుప్రభువు విగ్రహాన్ని ఉంచి పురవీధులలో బాజా భజంత్రీలతో, బాణసంచాలతో తేరు ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విచారణ గురువులు, మత కన్యలతోపాటు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## తిరుపతమ్మ కల్యాణోత్సవాలకు

# విస్తృత ఏర్పాట్లు



శ్రీతిరుపతమ్మవారి ఆలయం



స్థల శుద్ధి, గోపుజలో పాల్గొన్న ఆలయ ఈఓ కిషోర్‌కుమార్ తదితరులు

పెనుగంచిప్రోలు: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవాల (పెద్ద తిరునాళ్ల)కు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు ఈ ఉత్సవాలు కనుల పండువగా కొనసాగనున్నాయి. గోపయ్య సమేత శ్రీతిరుపతమ్మ అమ్మవారి కల్యాణంతో పాటు 41 రోజుల పాటు మండల దీక్ష చేపట్టిన వేల మంది స్వాములు తిరుముడి సమర్పించి దీక్ష విరమించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం వద్ద అమ్మవారి కల్యాణ వేడుక కోసం 70 అడుగుల వెడల్పు, 30 అడుగుల పొడవున విశాలమైన మండపాన్ని ఖమ్మం కళాకారులు నిర్మిస్తున్నారు.

**భారీ స్క్రీన్‌లు**

11వ తేదీన జరిగే అమ్మవారి కల్యాణ వేడుకను వీక్షించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలివస్తారు. వారి కోసం కల్యాణ మండపం ప్రాంగణంలో పది, ఆలయం చుట్టూ మరో ఐదు భారీ స్క్రీన్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఆలయానికి ప్రస్తుతం ఉన్న 62 సీసీ కెమెరాలతో పాటు కల్యాణం రోజున అదనంగా 24, మునేరు అవతల మామిడి తోటలో దీక్షాస్వాములకు అన్నదానం నిర్వహించే చోట మరో ఎనిమిది సీసీ కెమెరాలను తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్నామని ఈఈ రమ తెలిపారు. అమ్మవారి మామిడి తోటలో దీక్ష విరమించిన స్వాములు సుమారు 25 వేల మందికి అన్నప్రసాదం అందించనున్నారు. ఈ ఏర్పాట్లను ఈఓ కిషోర్‌కుమార్, ఈఈ రమ, ఏఈ రాజు పర్యవేక్షిస్తున్నారు.

**కల్యాణ వేదిక ప్రదేశంలో స్థల శుద్ధి పూజలు**

కల్యాణానికి సంబంధించి ఏర్పాటు చేస్తున్న కల్యాణ వేదిక ప్రదేశంలో శనివారం ఆలయ వేద పండితులు, ఆలయ పురోహితుడు ఆంజనేయశర్మ, ప్రధానార్చకుడు మర్రెబోయిన గోపిబాబు ఆధ్వర్యంలో స్థల శుద్ధి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ బి.హెచ్.వి.ఎస్.ఎన్.కిషోర్‌కుమార్, ఈఈ ఎల్.రమ, ఏఈఓ ఉమాపతి, తిరుమలేశ్వరరావు, ఏఈ రాజు పాల్గొన్నారు.

### వాగులో పడి బీటెక్ విద్యార్థి మృతి



మారేడుమిల్లి: గుంటూరు జిల్లా అమరావతిలో గల ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న నాగులపాటి నాగ మల్లేశ్వరరావు(19) అనే విద్యార్థి వాగులో పడి శనివారం మృతి చెందాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మండలంలోని పర్యాటక ప్రాంతమైన గుడిసె ప్రాంతాన్ని ఏడుగురు స్నేహితులతో కలిసి సందర్శించి, తిరుగు ప్రయాణంలో ఆకుమామిడికోట సమీపంలోని కాలకృత్యాల కోసం సంగువ వాగులోకి దిగాడు. ఈ సమయంలో నాగమల్లేశ్వరరావు కాలుజారి వాగులో పడి మునిగి మృతి చెందాడు. స్నేహితులు, ఆకుమామిడి కోట గ్రామస్తులు, వేజువాడకు చెందిన కొంత మంది గిరిజనులు కలిసి గాలింపు చర్యలు చేపట్టగా యువకుడి మృతదేహం లభ్యమైంది. దీనిపై మారేడుమిల్లి పోలీసులకు సమాచారం అందడంతో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కె.సాదిక్ తెలిపారు.

## ముగ్గురు ఘరానా దొంగలు అరెస్ట్

- పోలీసులను బెదిరించేందుకు ఒకరు ఆత్మహత్యాయత్నం
- స్టేషన్ బాత్‌రూమ్‌లో ఫినాయిల్ తాగడంతో ఆస్పత్రికి తరలింపు

తాడేపల్లి రూరల్‌: తాడేపల్లి పట్టణ రూరల్ పరిధిలో ఈ మధ్యకాలంలో కుంచనపల్లి, ఉండవల్లి సెంటర్లలో తాళాలు వేసిన ఇళ్లలో భారీ మొత్తంలో బంగారం, నగదు చోరీకి పాల్పడ్డ కేఎల్‌రావు కాలనీ, సీతానగరానికి చెందిన ఇద్దరు యువకుల్ని తాడేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. వారి నుంచి కొంత సొమ్ము రికవరీ చేశారు. మిగిలిన వాటి కోసం విచారణ చేస్తున్న క్రమంలో సీతానగరానికి చెందిన ఓ నిందితుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. బాత్‌రూమ్‌లో ఫినాయిల్ తాగిన ఈ సంఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం... సీతానగరానికి చెందిన నాగరాజు, దుర్గారెడ్డిని తాడేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. కుంచనపల్లిలో జరిగిన దొంగతనంలో రికవరీ చేసే క్రమంలో దుర్గారెడ్డి పొరపాటున ఉండవల్లి సెంటర్‌లో కూడా మేమే దొంగతనాలు చేశామని పోలీసుల వద్ద చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయమై నాగరాజును, దుర్గారెడ్డిని వేరువేరు చోట్ల ఉంచి ప్రశ్నిస్తుండగా నాగరాజు దొంగిలించిన వాటిని ఎక్కడ రికవరీ కింది ఇవ్వాల్సి వస్తుందోనని పోలీసులను బెదిరించేందుకు బాత్‌రూమ్‌లో ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన పోలీసులు తాడేపల్లిలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చేర్పించారు. సొంత ఖర్చులతో వైద్యం చేయిస్తున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. నెల రోజుల నుంచి ఫోన్ లొకేషన్ ద్వారా వేల ఫోను నెంబర్లను పరిశీలించి, సుమారు రూ.75 లక్షల విలువైన బంగారాన్ని రికవరీ చేసే ప్రయత్నం చేసే క్రమంలో ఈ ఘటన జరిగింది. దుర్గారెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు దొంగిలించిన బంగారాన్ని కొనుగోలు చేసిన వ్యక్తిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని రహస్యంగా విచారిస్తున్నట్లు సమాచారం . వివరణ కోరగా అలాంటిది ఏమీ లేదంటూ పోలీసులు దాటవేశారు. చిక్కిన ఇద్దరు నిందితులకు గంజాయి తాగే అలవాటు ఉందన్నారు. గంజాయి కూడా విక్రయిస్తున్నట్లు సమాచారం.

## నేడు స్కాలర్‌షిప్పులు అందజేత

కొరిటెపాడు: 'కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ – గుంటూరు' 'ది రాజోల్ తాలూకా తెలగ అఫీషియల్ అసోసియేషన్ – రాజోలు' సంయుక్త ఆధ్వర్యంలో 242 మంది పేద విద్యార్థులకు రూ. 10.37 లక్షల ఉపకార వేతనాలుగా ఆదివారం పంపిణీ చేయనున్నారు. ఇందులో రూ. 5.25 లక్షలు తులసి సీడ్స్ వారు 'కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలెజ్డ్ ' ద్వారా 104 మందికి ఇవ్వనున్నారు. మంగేన గంగయ్య తెలగ కల్యాణ మండపంలో ఉదయం 8 గంటలకు కార్యక్రమం ఉంటుంది. గౌరవ అతిథిగా తులసి గ్రూప్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు హాజరుకానున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్ చంద్ర తెలిపారు.